విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పచ్చగా ఉన్న తెలంగాణలో నిప్పులు పోసింది కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

పెద్దమందడి, ఫిబ్రవరి 10 : పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, పచ్చగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో నిప్పులు పోసింది కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ విమర్శించారు. సోమవారం పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది పచ్చగా ఉన్న రాష్ట్రంలో 420హామీలతో దొంగల ముఠా నిప్పులు పోసిందని వారు రేవంత్‌రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికే ప్రజలకు విసుకువచ్చిందన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ఏ పట్టణానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీని తిట్టని వారే లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు ఎన్నో అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారన్నారు. తెలంగాణను దేశంలోనే అన్నపూర్ణ రాష్ట్రంగా నిలబెట్టిన ఘనుడ కేసీఆర్ అని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి కరువు కాటకాలలో తాగునీరు అందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసిన ప్రభుత్వం అని అన్నారు. కానీ కాంగ్రెస్ సర్కారులో గ్రామాల్లో పది రోజులకు ఒకసారి కూడా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూనే ఉంటుందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. ఇటీవల చేసిన సర్వే బోగస్ సర్వే అని, రీ సర్వే నిర్వహించి బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్ననే అన్నాడని గుర్తుచేశారు. బీసీలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హవా చూపిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, నాయకులు రాజమహేందర్ రెడ్డి, వెంకటేశ్, కృష్ణారెడ్డి, సేనాపతి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గణేశ్, సురేశ్, అంజి, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మండలాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి 10 : మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. సోమవారం మండలకేంద్రంతో పాటు మానాజీపేట, మల్కపూర్, సోలీపూర్, షాపూర్, పర్వతాపూర్, మామిడిమాడ, సల్కపూర్, అప్పారెడ్డిపల్లి , మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి, తిర్మలాయపల్లి గ్రామాల్లో నాయకులు, అధికారులతో కలిసి సీసీ రోడ్డులు, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, మురళిధర్‌రెడ్డి, రాజు, ప్రకాశ్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రావు, రవి నాయక్, రమేశ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్

కొండేరు ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ మొగిలయ్య

- డీఎస్పీ మొగులయ్య

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 10: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ మొగులయ్య పేర్కొన్నారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరులో సోమవారం సీఐ రవి బాబు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 200 ఇండ్లల్లో తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలులేని 60 బైక్‌లు, 10 ఆటోలను స్వాధీనం చేసుకోన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు వద్ద ఉంచుకోడం తోపాటు హెల్‌మెంట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సైబర్‌నేరాలపై జాగత్తగా ఉండాలని, అసాంఘిక శక్తులపై నిఘా ఉంచి 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కొండేరులో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకురావాలని తెలిపారు. సీఐ రవిబాబు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్సైలు, 50 మంది పోలీసు సిబ్బంది కమ్యూనిటీ కంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్, ఎస్సైలు వెంకటస్వామి, మహేశ్, స్వాతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా డబ్బాల ఏర్పాటు

- తీసేది లేదంటున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 10 : పట్టణంలో రోజు రోజు ఆక్రమణలు ఎక్కువవతున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ చిన్నపాటి డబ్బా ఏర్పాటు చేయడం, తోపుడు బండి పెట్టడం వంటి చేస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత స్థలంపై పూర్తి అధికారం చెలాయిస్తున్నారు. ఇదే తంతు ఎంఏఎల్‌డీ కళాశాల ముందు చోటు చేసుకున్నది. కళాశాలకు, కోటలోని ఆలయంలోకి వెళ్లే ప్రధాన మార్గంలో అనధికారంగా డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారు. కళాశాలకు, ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని, అంతేకాక ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని వెంటనే డబ్బాలను తొలగించాలని సదరు నిర్వాహకులను అధికారులు, ఆలయ నిర్వాహకులు కోరారు. దీనిపై డబ్బాలు ఏర్పాటు చేసుకున్న వారు ఎదురుతిరిగి ఇష్టానుసారంగా దుర్భాషాలాడుతూ డబ్బాలను తొలగించేది లేదు ఎవరికైనా చెప్పుకోండంటూ ఎదురుతిరిగారు. ఇలా ప్రతి కూడలి వద్ద, రథశాల ముందు తోపుడు బండ్ల వ్యాపారుల, ముఖ్య పండ్ల వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డుపై బైక్ ఆపితే ఫొటో తీసి జరిమానా వేస్తున్నారే కానీ, రోడ్లను కబ్జా చేసే వారిని మాత్రం ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న అనధికార డబ్బాలు, తోపుడు బండ్ల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాల ఎదుట రోడ్డుకు అండ్డంగా ఏర్పాటు చేసిన డబ్బా

ఈసీ నిబంధనలు తప్పనిసరి పాటించాలి

ప్రజవాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10 : ఎన్నికల సిబ్బంది ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి అనుమానాలు లేకుండా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రానున్న స్థానిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా సోమవారం ఐడీఓసీ నేషన్ ఇన్ఫర్మేటిక్ సెంటర్‌లో మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీంగ్ సిబ్బంది తనకు తోచినట్లుగా వ్యవహరి ంచడానికి వీలు లేదన్నారు. ఎన్నికల ని ర్వహణపై జిల్లాస్థాయి మా స్టర్ ట్రైనర్లు ఇచ్చే ఎన్నికల ని ర్వహణ శిక్షణను బాగా అర్థం చేసుకొని మండలస్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మండల ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహిస్తున్నందున బ్యాలెట్ బాక్స్ ఏవిధంగా తెరవాలి , సీల్ ఏ విధంగా చే యాలని అనే అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీవో సురేశ్, జె డ్పీ సీఈవో యాదయ్య, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, మండల ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులు ఉంటే చెప్పాలి : అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదనలు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాలు పరిశీలించి ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే చెప్పాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల వివరాలు వెల్లడించామని, గోపాల్‌పేట మండలంలోని జింకలబీడు గ్రామ పంచాయతీ, కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీల్లో ముసాయిదా పోలింగ్ కేంద్రాల వివరాలు ఇచ్చామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిబ్రవరి 13న జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో చెప్పాలని సూచించారు. గోపాల్‌పేట జింకలబీడు తండాలో ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్‌లో రెండు పోలింగ్ కేం ద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీలో యూసీఎస్‌లో 10 పోలింగ్ కేంద్రాలు , అంగన్‌వాడీ కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వీటిలో ఏమైనా అభ్యంతరం ఉంటే చెప్పాలని సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సైతం ముసా యిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఫిబ్రవరి 13న ప్రకటిస్తారని వాటిని పరిశీలించి అదే రోజు జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో చెప్పాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీపీవో సురేశ్, నాయకులు రాజేందర్, రహీమ్, కొత్తగొల్ల శంకర్, సయ్యద్ జమీల్, భరత్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ప్రజవాణికి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన వినతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 46 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

మున్సిపాలిటీలు, గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే మాన్యువల్ స్కావేంటజర్లు ఎవరైనా ఉన్నారా అని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారిని వివరాలు కోరగా అలాంటి వారు ఇప్పుడు జిల్లాలో ఎవరూ లేరని నివేదిక ఇచ్చారు. పారిశుధ్య కార్మికులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా పాలసీలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి 10 : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంసీఆర్, హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ 139వ స్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ 16 మంది అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితులు, నియోజకవర్గాలు, మండలాలు, జిల్లాలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి కలెక్టర్ వారికి అవగాహన కల్పించారు. శిక్షణకు వచ్చిన అధికారులు సోమవారం నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు షెడ్యూల్‌కు అనుగుణంగా జిల్లాలో పనిచేయాలని సూచించారు.16మంది శిక్షణ అధికారులను నాలుగు గ్రూపులుగా ఏర్పాటు చేసి జిల్లాస్థాయిలో డీఆర్‌డీవో, ఈడీఎస్సీ అధికారులు నోడల్ పాయింట్‌గా, మండల స్థాయిలో తాసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు సమన్వయ బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం, మిషన్ భగీరథ, వనమహోత్సవం, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి, రైతు భరోసా, ఆయూష్మాన్ భారత్, నేషనల్ హెల్త్ మిషన్, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పోషణ అభియాన్, విశ్వకర్మ, అమృత 2.0 తదితర ప్రభుత్వ పథకాల అమలు తీరును కలెక్టర్ వారికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అధికారులు రమేశ్‌బాబు, నర్సింహులు పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం

కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహాకాలు అందజేస్తుందని కలెక్టర్ సంతోష్ తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన లక్ష్మి, సూర్యప్రకాశ్ కులాంతర వివాహం చేసుకోగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2,50,000 ప్రోత్సాహక బహుమతిని వారికి అందజేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపం లో జంటకు బాండ్ అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సరోజ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

గద్వాల, ఫిబ్రవరి 10 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 41ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో అలంపూర్ 100 పడకల దవాఖానను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని బీఎస్పీ కోరినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తుంటారని వారి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్

అర్చకులపై దాడి తగదు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 10: చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని సత్యప్రకాశ్ అన్నారు. అర్చకుడిపై దాడిని ఖండిస్తూ సోమవారం రామాపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. రామరాజ్య స్థాపనకు సహకరించాలని కోరుతూ.. అర్చకుడు రంగరాజన్‌పై 20మంది దాడిచేయడం హేయమైన చర్య అని, దాడికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్చకులు, హిందువులు రంగరాజన్‌కు మద్దతుగా నిలబడాలన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆయా మఠాల పీఠాధిపతులు ఆయనకు మద్దతునిచ్చారన్నారు. కార్యక్రమంలో నరేశ్, మధు, పరశురాములు పాల్గొన్నారు.

చేతి బోరు ధ్వంసం

పెబ్బేరు, ఫిబ్రవరి 10: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం కొప్పునూరులో అధికార పార్టీకి చెందిన నాయకుడి అండదండలతో ఓ వ్యక్తి ప్రజలకు తాగునీరు అందించే చేతి బోరును నేలమట్టం చేశారని గ్రామానికి చెందిన కొందరు ఆరోపించారు. సోమవారం భగత్‌సింగ్ యువజన సంఘం అధ్యక్షుడు మధు, నాయకులు తగరం కురుమయ్య, తగరం నర్సింహ, రాజు, వినోద్, శ్రీను, సాయి, రమేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలోని ఐదో వార్డులో డ్రైనేజీ నిర్మాణం కోసం గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నప్పటికీ రోడ్డును ఆక్రమించి జేసీబీతో బోరును తొలగించారన్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని వారు వాపోయారు. ఉన్నతాధికారులైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అవార్డుకు విద్యార్థుల ఎంపిక

గద్వాల, జెడ్పీ సెంటర్, ఫిబ్రవరి 10 : సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు ఎంపికలో భాగంగా ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో గద్వాల బెటర్ లైఫ్ మోడల్ స్కూల్ విద్యార్థులు స్టేట్ సెకండ్, జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. గణితం, సైన్స్ పరీక్షల్లో ఐదో తరగతి చదువుతున్న సాయిక్ష స్టేట్ రెండో ర్యాంకు సాధించగా, నాలుగో తరగతి చదువుతున్న శ్రీనివాస్‌రెడ్డి జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. వీరిని ఈనెల 16వ తేదీన లలిత కళాతోరణంలో సన్మానించనున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రతిభా పరీక్షలు విద్యార్థులకు ఉపయోగం

గద్వాలటౌన్, ఫిబ్రవరి 10 : ప్రతిభా పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు ఉపయోగకరమని జిల్లా సైన్స్ అధికారి భాస్కర్‌పాపన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో ఫోరమ్ ఆఫ్ ఫిజిక ల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో భౌతిక, రసాయన శాస్త్రాల్లో జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షలు సోమవారం నిర్వహించారు. పరీక్షలకు 33 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్ర స్థాయి పరీక్షలకు ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జహిరుద్దీన్, కృష్ణయ్య, శ్రీనివాసులు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రేరణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10: వనపర్తి చాణిక్య ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ప్రణయ్ కుమార్ గుజరాత్ రాష్ట్రంలోని వడ్ నగర్‌లో జరిగిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ సాజుపాల్ తెలిపారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ కార్యాలయం నుంచి విద్యార్థికి ప్రశంసాపత్రం చేరుకుందని చెప్పారు. గతేడాది దసరా సెలవుల్లో గుజరాత్‌లో ప్రేరణ అనే వ్యాసరచన శిక్షణ కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 600మంది విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందగా వనపర్తి జిల్లా నుంచి ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారని, సోమవారం ప్రశంసాపత్రం విద్యార్థికి అందజేసి అభినందించారు. తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

బీసీలకు సీఎం క్షమాపణలు చెప్పాలి

సమావేశంలో మాట్లాడుతున్న కురువ పల్లయ్య

- బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురవ పల్లయ్య

గద్వాల, ఫిబ్రవరి 10 : బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం బీసీల జనాభాను ఉద్దేశపూర్వకంగానే తగ్గించి ద్రోహం చేశాడని తక్షణమే రీసర్వే నిర్వహించాలన్నారు. 22లక్షల మంది జనాభా లెక్కల్లో లేకుండా చూపడం దారుణమన్నారు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల జనాభా తగ్గి కేవలం ఒక వర్గం జనాభా ఎట్లా పెరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 లో జరిపించిన సమగ్ర సర్వే ప్రకారం బీసీలు(ముస్లింలలోని బీసీలు కాకుండా)51శాతమని నిర్ధారణ కాగా ప్రస్తుత సర్వేలో 46శాతానికి ఎలా తగ్గిందన్నారు. కులగణ న సర్వేలో చోటు చేసుకున్న తప్పులను వెంటనే సరిదిద్దాలని, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించి కేబినెట్ విస్తరణలో నలుగురు బీసీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకులు మాధవ్, ఓంకార్, సందేశ్, పవన్, మహేశ్, చక్రవర్తి, బన్ను, జాను, సుందర్, ఉదయ్ పాల్గొన్నారు.

బీసీల వ్యతిరేకి కాంగ్రెస్ సర్కార్

మాట్లాడుతున్న యువజన నాయకుడు రామకృష్ణ

అయిజ, ఫిబ్రవరి 10: బీసీలకు వ్యతిరేకిగా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కాడని బీఆర్ఎస్ యువజన నాయకుడు రామకృష్ణ అన్నారు. సోమవారం అయిజ బీఆర్ఎస్ కార్యాలయంలో యువజన నాయకులు విలేకరులతో మాట్లాడారు. కులగణనలో బీసీలను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపారని విమర్శించారు. అధికారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసి అధికారం చేపట్టాక కాంగ్రెస్ ప్రభుత్వం తోకముడిచిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంపు మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.లక్ష కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. బీసీ కులాల కార్పొరేషన్లకు వంద కోట్లు ఏమైందని ప్రశ్నించారు. తప్పుల తడకగా రిజర్వేషన్‌ను తిరిగి రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు మల్లికార్జున్, వీరేశ్, యువజన నాయకులు సత్యం, వీరేశ్‌గౌడ్, అంజి, మోహన్‌గౌడ్, శివన్న, అశోక్‌కుమార్, నర్సింహులు, అశోక్ గౌడ్, ప్రదీప్, పుణ్యమూర్తి, షేక్షావలి, హరి పాల్గొన్నారు.

హామీలను విడుతల వారీగా అమలు చేస్తాం

అమరచింతలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, ఫిబ్రవరి 10 : కాస్త ఆలస్యమైనా ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని విడులత వారీగా అమలు చేస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్య